"మధురమైన పిల్లలూ - మీరు ఇప్పుడు మూడు దారుల కూడలిలో నిలబడ్డారు, ఒక వైపు దుఃఖధామము ఉంది, ఇంకొక వైపు శాంతిధామము ఉంది మరియు మూడవ వైపు సుఖధామము ఉంది, ఇప్పుడు మేము ఎక్కడికి వెళ్ళాలి అన్నది నిర్ణయించుకోండి"

ప్రశ్న:- ఏ నిశ్చయము ఆధారంగా పిల్లలైన మీరు సదా హర్షితముగా ఉండగలుగుతారు?

జవాబు:- అన్నింటికన్నా ముందుగా, మేము ఎవరికి చెందినవారిగా అయ్యాము! అన్న నిశ్చయం ఉండాలి. తండ్రికి చెందినవారిగా అవ్వడంలో వేద-శాస్త్రాలు మొదలైన పుస్తకాలను చదవాల్సిన అవసరం లేదు. రెండవ నిశ్చయం ఏముండాలంటే - మా కులము అన్నింటికన్నా శ్రేష్ఠమైన దేవతా కులము - ఈ స్మృతితో మొత్తం చక్రమంతా గుర్తుకు వచ్చేస్తుంది. తండ్రి మరియు చక్రం యొక్క స్మృతిలో ఉండేవారు సదా హర్షితముగా ఉంటారు.

పాట:- ఎవరో నన్ను తనవారిగా చేసుకుని... (కిసీ నే అప్నా బనాకే ముఝ్ కో...)

ఓం శాంతి. పిల్లలైన మీకు మొట్టమొదట - మేము ఎవరికి చెందినవారిగా అయ్యాము! అన్న సంతోషము ఉంటుంది. మేము గురువుకు చెందినవారిగా అయ్యాము అని అనరు. తండ్రికి చెందినవారిగా అవ్వాల్సి ఉంటుంది. శరీరాన్ని వదిలినా సరే మళ్ళీ ఇంకొక తండ్రికి చెందినవారిగా అవ్వాల్సి ఉంటుంది. ఇక్కడ కూడా తండ్రికి చెందినవారిగా అవ్వాలి. వేద-శాస్త్రాలు మొదలైనవేవీ అవసరం లేదు. కొడుకు జన్మిస్తే, నా ఆస్తికి ఇతను యజమాని అని తండ్రి భావిస్తారు. ఇది సంబంధం యొక్క విషయము. పిల్లలైన మీకు కూడా తెలుసు - మనం వాస్తవానికి ఇంతకుముందు కూడా పారలౌకిక తండ్రి అయిన శివబాబాకు పిల్లలము. మొదట మనం ఆత్మలము, ఆ తర్వాత మనకు శరీరము లభిస్తుంది. మీకు శరీరమైతే ఉంది. ఇప్పుడు మీకు అనంతమైన తండ్రి లభించారు. వారు వచ్చి తమ పరిచయాన్ని ఇచ్చారు. మీరు అంటారు - బాబా, మేము మీ వారము, ఇంకే సంబంధాలు లేవు. తండ్రికి పిల్లలుగా అయ్యారు. వీరు అంటారు - నేను ఏమీ గురువును-పండితుడిని కాను. బోర్డుపై కూడా బ్రహ్మాకుమార-కుమారీలు అన్న పేరు వ్రాయబడి ఉంది కావున తప్పకుండా తండ్రి కూడా ఉంటారు. మేము బ్రహ్మాకుమార-కుమారీలము అని మీరు వ్రాస్తారు. ఇది సంబంధము అయినట్లు కదా. తల్లి-తండ్రి యొక్క సంబంధం ఉండాలి. నీవే తల్లివి, తండ్రివి, మేము మీ పిల్లలము... అని పాడుతారు కూడా. ఆత్మకు ఆ అవినాశీ స్మృతి ఉంటుంది. మేము ఎప్పుడైతే మీకు పిల్లలుగా అవుతామో, అప్పుడు వారసత్వాన్ని తీసుకుంటాము. ఇప్పుడు మీకు తెలుసు - మనం మాతా-పితలకు చెందినవారిగా అయ్యాము. మనం శివబాబాకు పిల్లలము కావున తప్పకుండా తండ్రి మరియు వారసత్వము గుర్తుకొస్తాయి. మీ చేత పుస్తకాలు మొదలైనవేవీ చదివించడం జరుగదు, మీకు కేవలం నిశ్చయం కలిగించడం జరుగుతుంది. తండ్రికి చెందినవారిగా అయ్యారు, కావున ఇప్పుడు వారిని స్మృతి చేయండి.

తండ్రి అంటారు - నన్ను స్మృతి చేయడం ద్వారా మీరు ఈ విధంగా (లక్ష్మీ-నారాయణులు వలె) అవుతారు. ఇది ఎంత సహజమైన విషయము. విశాలబుద్ధి కలవారిగా ఉండాలి కదా. వేరే ఏదో అర్థం చేయించడం లేదు, కేవలం - మనం ఏ విధంగా 84 జన్మల చక్రంలోకి వస్తాము అని మన కులానికి సంబంధించిన విషయాన్నే తెలియజేస్తారు. మిగిలిన వేద-శాస్త్రాలు మొదలైనవి చదవడం నుండి కూడా మిమ్మల్ని విడిపిస్తారు. తండ్రినే స్మృతి చేస్తూ ఉండాలి. సృష్టి చక్రం ఎలా తిరుగుతుంది అన్నది కూడా బుద్ధిలో ఉంది. దాని ఆదిమధ్యాంతాలను తెలుసుకోవడం ద్వారానే మీరు ఉన్నతోన్నతులుగా అవుతారు. స్వర్గానికి యజమానులుగా అవుతారు. మిమ్మల్ని సదా కొరకు హర్షితముఖులుగా తయారుచేస్తాను. ఇది ఎంత సహజమైన విషయము. అయినా కూడా మర్చిపోతారు. కారణమేమిటి? తల్లిదండ్రులను ఎప్పుడూ పిల్లలు మర్చిపోరు. తండ్రిని మరియు వారసత్వాన్ని స్మృతి చేసినట్లయితే ఎల్లప్పుడూ హర్షితంగా ఉంటారు. ఎప్పుడైనా ఏదైనా దుఃఖం కలిగినప్పుడు తండ్రినే తలచుకుంటారు. తప్పకుండా తండ్రి సుఖాన్ని ఇచ్చారు. ఎవరైనా దుఃఖమిస్తే, ఓ బాబా, ఓ భగవంతుడా అని అంటారు. ప్రతి జన్మలోనూ అయ్యో-అయ్యో అంటూ ఆర్తనాదాలు చేస్తూ వచ్చారు. ఇప్పుడు పిల్లలైన మీకు పూర్తిగా సహజముగా అర్థం చేయిస్తారు. మీరు ఆరోగ్యంగా లేకపోయినా సరే, ఎంత అనారోగ్యం ఉన్నా సరే మీరు సేవ చేయవచ్చు. ఏ విధంగా అనారోగ్యం ఉన్నప్పుడు మనుష్యులను రామ-రామ అని అనమని చెప్తారు. మీరు కూడా అనారోగ్యంలో - శివబాబాను స్మృతి చేయండి అని ఇతరులకు చెప్పండి. ఈ విధంగా తప్పకుండా ఇతరులకు స్మృతిని కలిగించవలసి ఉంటుంది. మీరు మరణించే పరిస్థితుల్లో ఉన్నా కూడా ఈ జ్ఞానాన్ని

ఇతరులకు ఇవ్వవచ్చు. మీరు పరమాత్ముని పిల్లలు, వారిని స్మృతి చేయండి. శివబాబా అనంతమైన తండ్రి, వారే వారసత్వాన్ని ఇస్తారు. సేవ చేసే అభిరుచి ఉన్నట్లయితే మరణించే సమయంలో కూడా ఇతరులకు జ్ఞానాన్ని ఇస్తారు. అంతేకానీ మీరు హాస్పిటల్ లో పడి ఉన్నారు, నోరు మూసుకుపోయింది అన్నట్లు ఉండకూడదు. నోటి నుండి ఏదో ఒకటి వెలువడుతూ ఉండాలి. ఎంత మంచి అవస్థ ఉండాలి. అనారోగ్యంలో కూడా ఎంతో సేవ చేయవచ్చు. మిత్ర-సంబంధీకులు వస్తారు, వారికి కూడా ఈ విధంగా చెప్పాలి - పరమాత్మను స్మృతి చేయండి, వారే అందరినీ రక్షించేవారు, అందుకే శివబాబాను స్మృతి చేయండి, వారు ఒక్కరే. వారసత్వం కూడా అందరికీ ఒక్కరి నుండే లభిస్తుంది. లౌకిక సంబంధంలో వారసత్వము పురుషులకు లభిస్తుంది. కన్య 100 మంది బ్రాహ్మణుల కన్నా ఉత్తమమైనవారు. పవిత్రమైనవారికి దానం ఇవ్వడం జరుగుతుంది. కన్యలైన మీరు అందరికన్నా పవిత్రమైనవారు, అందుకే మేము కన్యాదానం చేస్తాము అని అంటారు. దానిని గొప్ప దానంగా భావిస్తారు. వాస్తవానికి అదేమీ దానము కాదు. దానము అనేది ఇప్పుడు మీరు చేస్తారు. స్వర్గ మహారాణిగా అయ్యేందుకు మేము మా కన్యను శివబాబాకు ఇస్తాము అని అంటారు. కానీ కన్య కూడా బాగా చదువుకున్నవారై ఉండాలి, మన దైవీ కులానికి చెందినవారై ఉండాలి, అర్థం చేయించిన వెంటనే అర్థం చేసుకునేలా ఉండాలి, సేవాధారిగా ఉండాలి. ఇక్కడ చిన్న పిల్లలను సంభాళించేది లేదు. శివబాబా మీ అనంతమైన తండ్రి అని ఎవరికైనా అర్థం చేయించడం చాలా సులభము. చిత్రాలు ఎదురుగా ఉన్నాయి. చూడండి, వీరు ఈ విధంగా సత్యయుగ వారసత్వాన్ని పొందుతున్నారు. ఈ లక్ష్మీ-నారాయణులకు వారసత్వం ఎక్కడి నుండి లభించింది? ఇది ఎంత సహజమైన విషయము, అందుకే బాబా పెద్ద చిత్రాలను కూడా తయారు చేయిస్తున్నారు. ఇప్పుడు ఈ నాటకం పూర్తవుతుంది. మనం 84 జన్మల పాత్రను అభినయించాము, ఇప్పుడు మళ్ళీ తిరిగి బాబా వద్దకు వెళ్తాము, తర్వాత కొత్త ప్రపంచంలోకి వస్తాము. మన బాబా కొత్త ప్రపంచానికి రచయిత, ఆ ప్రపంచానికి మనల్ని యజమానులుగా తయారుచేస్తారు. అనంతమైన తండ్రి నుండి సదా సుఖపు వారసత్వం మీకు ఎలా లభిస్తుంది - అని మీకు కూడా ఆ విధానాన్ని తెలియజేస్తారు. మొదట ఇది అర్థం చేయించాలి - నేను ఆత్మను, ఆత్మనైన నేను తింటాను, ఆత్మనైన నేను నడుస్తాను. ఈ విధంగా చాలా మంచి ప్రాక్టీస్ కావాలి. దేహాభిమానం తెగిపోవాలి, దేహాభిమానులకు లౌకిక సంబంధాలు గుర్తుకొస్తాయి. దేహీ-అభిమానులకు పారలౌకిక తండ్రే గుర్తుంటారు. లేస్తూ-కూర్చుంటూ-నడుస్తూ - నేను ఆత్మను అన్నది బుద్ధిలో ఉంచుకోవాలి. తండ్రి మతంపై నడుచుకోవాలి. శివబాబా మతాన్ని ఇస్తున్నారు - స్వయాన్ని ఆత్మగా భావించండి. కష్టపడాలి. స్వర్గంలోని సభ్యులుగా అయితే అవుతారు. కానీ కొంచెంలోనే సంతోషపడిపోకండి. స్వర్గములోకైతే వెళ్తారు. కానీ పక్కా స్వంత పిల్లలుగా అవ్వండి. ఎవరైతే బాప్ దాదాను మాత్రమే స్మృతి చేస్తారో వారినే స్వంత పిల్లలు అని అంటారు. ఇంకెవరైనా గుర్తుకొస్తే వారు సవతి పిల్లలు అవుతారు. ఇరువురూ గుర్తుకు వచ్చేవారు ఎంతోమంది ఉన్నారు. ఈ తండ్రి అవినాశీ స్వర్గ వారసత్వాన్ని ఇచ్చేవారు. ఇది కూడా కులమే, అది కూడా కులమే. దాని నుండి దుఃఖమే లభిస్తుంది. అయితే అల్పకాలికమైన, క్షణభంగురమైన సుఖ వారసత్వం లభిస్తుంది. ఇప్పుడు బుద్ధి ద్వారా నిర్ణయించుకోవాలి - మేము ఎటు వైపు వెళ్తున్నాము మరియు ఎటు వైపు వెళ్ళాలి? లౌకికం వైపా లేక పారలౌకికం వైపా? బుద్ధి అంటుంది - పారలౌకిక తండ్రికి చెందినవారిగా అయి మనం స్వర్గం వైపుకు ఎందుకు వెళ్ళకూడదు? లౌకిక సంబంధాలతో జీవిస్తూ మరణించాలి. పారలౌకిక తండ్రికి చెందినవారిగా అవ్వడంతో స్వర్గానికి యజమానులుగా అవుతారు. ఇక్కడైతే నరకానికి యజమానులుగా అవుతారు. ఇప్పుడు ఆత్మ అంటుంది - బుద్ధిని ఎక్కడ జోడించాలి? మన శాంతిధామానికి, సుఖధామానికి వెళ్ళాలా లేక ఇక్కడికి (దుఃఖధామములోకి) వెళ్ళాలా? వాస్తవానికి ఇక్కడికి (దుఃఖధామములోకి) వెళ్ళాలి... అన్న ప్రస్తావనే రాకూడదు. ఇక్కడైతే జన్మ-జన్మలుగా ఉన్నారు. ఇప్పుడిక మేము పారలౌకిక తండ్రిని ఎప్పుడూ వదిలిపెట్టము.

ఇక్కడ పిల్లలైన మీరు సమ్ముఖంలో కూర్చున్నారు. మీకు లౌకిక సంబంధాలేవీ లేవు. మేము బాబాతో పాటు ముక్తిధామానికి-శాంతిధామానికి వెళ్ళాలి అని బుద్ధి చెప్తుంది. ఉదయాన్నే లేచి ఈ విధంగా కూర్చొని విచార సాగర మంథనము చేయాలి. అలా కూర్చోవడంతో ఎంతో ఆనందము కలుగుతుంది. ఇప్పుడు ఎటు వైపు వెళ్ళాలి? నరకం వైపుకు ఎందుకు వెళ్ళాలి? ఈ మాయ చాలా మోసం చేస్తుంది. ఇప్పుడు మీ వద్ద లక్ష్యము-ఉద్దేశ్యము ఉన్నాయి. ఇప్పుడు మీరు తీరంలో ఉన్నారు, మీకు తెలుసు - ఇటువైపు దుఃఖమే దుఃఖము ఉంది, అటు వైపు 21 జన్మల సుఖము ఉంది. తండ్రి అంటారు - నన్ను స్మృతి చేయండి ఎందుకంటే మీరు నా వద్దకు రావాలి. మాయ అంటుంది - ప్రపంచం వైపుకు వెళ్ళండి. ఎక్కడికి వెళ్ళాలి? దారి అయితే లభించింది. ఒక వైపు స్వర్గములోకి వెళ్ళే దారి ఉంది, ఇంకొక వైపు నరకములోకి వెళ్ళే దారి ఉంది. మూడు దారుల కూడలి ఉంటుంది కదా. మూడు వీధుల మధ్యలో కూడలి ఉంటుంది. ఇప్పుడు మనం ఎటు వైపు వెళ్ళాలి? ఒక వీధి - ముక్తి వైపుకు వెళ్ళేది, ఇంకొక వీధి జీవన్ముక్తి వైపుకు వెళ్ళేది మరియు ఇంకొకటి నరకము వైపుకు వెళ్ళేది. ఏ విధంగా మూడు నదుల సంగమం ఉంటుందో, అలా నివసించే

స్థానాలు మూడు ఉన్నాయి. ఒక స్థానములో మనం ఉన్నాము. మూడు దారుల కూడలి యొక్క ఉదాహరణ బాగుంది. ఇప్పుడు ఎక్కడికి వెళ్ళాలి? నరకమైతే వినాశనమవ్వనున్నది. ఇక్కడ ఎంతో దుఃఖము ఉంది. ఇప్పుడు మనం మూడు దారుల కూడలిలో నిలబడి ఉన్నాము. వెనుకకైతే వెళ్ళము.

దుఃఖపు వీధి నుండి బయటకు తీసి బాబా మూడు దారుల కూడలిలో నిలబెట్టారు. దుఃఖధామం యొక్క వీధిలో నుండైతే మీరు జన్మ-జన్మలూ ప్రయాణిస్తూ వచ్చారు. ఇప్పుడు - ముక్తి-జీవన్ముక్తుల వైపుకు వెళ్ళాలి అని బుద్ధి చెప్తుంది. ముక్తిధామంలోనైతే సదా కొరకు కూర్చునేది లేదు. మేము పాత్ర నుండి విముక్తులైపోవాలి, అసలు రానే రాకూడదు అన్నట్లు కాదు. పాత్ర నుండి విముక్తులుగా అవ్వడమనేది జరుగదు. డ్రామానుసారముగా తప్పకుండా వస్తారు. దోమల వలె మరణిస్తారు. ఇంతటి దుఃఖాన్ని చూసారు కావున మళ్ళీ ఇంతటి సుఖాన్ని కూడా చూడాలి. డ్రామాలో బాబా తూకమును సరిగ్గా ఉంచారు, ఎవరి పాత్ర అయితే తక్కువగా ఉంటుందో, వారు ఒకటి-రెండు జన్మల కోసం వస్తారు, మళ్ళీ వెళ్ళిపోతారు. ఇప్పుడు మీరు మూడు దారుల కూడలిలో నిలబడ్డారు. ఇది శాంతిధామము, అది సుఖధామము. ఒకవేళ శాంతిధామానికి వెళ్ళాలనుకుంటే శాంతిధామాన్నే స్మృతి చేస్తూ ఉండండి. ముక్తినైతే స్మృతి చేయవలసి ఉంటుంది కదా. చివర్లో వచ్చేవారు ముక్తిధామంలో ఎక్కువగా ఉన్న కారణంగా వారికి ముక్తిధామమే ఎక్కువగా గుర్తుకొస్తుంది. స్వర్గంలోకి మనం త్వరగా వెళ్ళాలి అని, మీకు జీవన్ముక్తిధామము గుర్తుకొస్తుంది. వారు - మేము ముక్తిలో ఉండాలి అని భావిస్తారు. అచ్ఛా, తండ్రిని స్మృతి చేస్తూ ఉండండి, ఇందులో కూడా కళ్యాణము ఉంది. నిర్వాణధామంలో ఉండాలి అని అనుకుంటున్నారంటే, సుఖధామంలోకి రావాలి అని అనుకోవడం లేదంటే, వారి పాత్ర కనబడటం లేదని దీని ద్వారా అర్థమవుతుంది. మీరైతే సుఖధామానికి వెళ్ళే మూడు దారుల కూడలిలో నిలబడి ఉన్నారు. పురుషార్థము చేస్తున్నారు.

మనుష్యులకు మీ సత్యమైన యోగము మంచిగా అనిపిస్తుంది. అచ్ఛా, తండ్రిని స్మృతి చేస్తూ ఉండండి. చక్రాన్ని కూడా స్మృతి చేయవలసిన అవసరం లేదు. ఈ జ్ఞానము అన్ని ధర్మాల వారి కోసము ఉంది. డ్రామానుసారముగా ఎవరు ఎంత తీసుకున్నారో, వారు దాని అనుసారముగా వచ్చి తమ పదవిని తీసుకుంటారని అర్థం చేసుకుంటారు. ముక్తిధామానికి వెళ్ళాలనుకుంటే తండ్రిని స్మృతి చేయండి. ఒకవేళ, మేము సదా సుఖంగా ఉండాలి అని అనుకుంటే - అక్కడ (సత్యయుగంలో) శాంతి కూడా ఉంటుంది, సుఖము కూడా ఉంటుంది. ఎవరు ఎటు వైపుకు చెందినవారై ఉంటే, వారు ఆ వారసత్వాన్ని తీసుకోవాలి. సర్వుల ముక్తి-జీవన్ముక్తి దాత అయితే తండ్రే కదా. ఒకటి-రెండు జన్మలు తీసుకోవలసి ఉంటే వారు అందులోనే సుఖాన్ని కూడా చూస్తారు, దుఃఖాన్ని కూడా చూస్తారు. దోమ వచ్చింది మరియు వెళ్ళింది అన్నట్లు ఉంటుంది. దానినేమీ అమూల్య జీవితము అని అనరు. మీరు సదా హర్షితముగా ఉండేవారు. మీరు లైట్ హౌస్ గా అయి నిలబడ్డారు. మీరు రెండు దారులనూ చూపించవచ్చు. అయితే ముక్తిధామానికి వెళ్ళండి, లేదంటే ముక్తి-జీవన్ముక్తి, రెండింటినీ స్మృతి చేయండి. ఇందులో శాస్త్రాలు మొదలైనవి చదవవలసిన అవసరమేమీ లేదు. కుమారీలకు ఇది చాలా సహజము ఎందుకంటే వారు మెట్లు ఎక్కలేదు. బాల్యంలో చదువుకుంటే మంచిది ఎందుకంటే బుద్ధి మంచిగా ఉంటుంది, ఎవ్వరి స్మృతి ఉండదు. మీరందరూ కుమారీలు, మీరు ఇంకేమీ చేయాల్సిన పని లేదు, కేవలం చదువులో నిమగ్నమవ్వండి, అంతే, నావ తీరానికి చేరుకుంటుంది. ఈ విషయాలను అనంతమైన తండ్రే అర్థం చేయిస్తారు, వారు మళ్ళీ మనల్ని స్వర్గానికి యజమానులుగా చేస్తారు. మనం ఈ విధంగా తయారవ్వాలి అని చిత్రాలు కూడా ఉన్నాయి. తండ్రి అంటారు - ఈ చదువు ద్వారా మీరు మళ్ళీ దేవతలుగా అవుతారు. ఇప్పుడు ఈ ఆట పూర్తవ్వనున్నది. మనుష్యులు ఘోర అంధకారంలో పడి ఉన్నారు. మీరు ఇప్పుడు ప్రకాశంలో ఉన్నారు. తండ్రి వచ్చి నిద్ర నుండి మేల్కొల్పారు. ఈ విధంగా బుద్ధిని, ఆత్మను మేల్కొల్పడం జరుగుతుంది. తండ్రి వచ్చి ఈ విధంగా మేల్కొలుపుతారు - మేల్కోండి, సుఖధామం కొరకు పురుషార్థం చేయండి. మీ కులానికి చెందినవారు ఎవరైతే ఉంటారో వారు వస్తూ ఉంటారు, వృద్ధిని పొందుతూ ఉంటారు. మీ ప్రజలు ఎంతమంది తయారవుతారు అనేది మీరు లెక్క వేయగలరా? వేయలేరు. కొందరు కొంత వింటారు, మరికొందరు కొద్దిగా విని వెళ్ళిపోతారు. లెక్కను ఏమైనా తీయగలరా. పెద్ద మాల, చిన్న మాల, షావుకారులు, ప్రజలు ఎలా తయారవుతారు, ఎవరు తయారవుతారు, అదంతా బుద్ధిలో ఉంది. ముఖ్యంగా సూర్యవంశీ మహారాజు-మహారాణిగా ఎవరవుతారు, మళ్ళీ చంద్రవంశీయులుగా ఎవరవుతారు, ఎంతమంది ప్రజలు తయారవ్వాలి - ఈ విషయాలన్నీ మీకు ఇక్కడ తెలియజేయడం జరుగుతుంది. మొత్తం వృక్షము లేక అన్ని ధర్మాల చక్రం మధ్యలో నుండి కొమ్మలు-రెమ్మలు, ఆకులు మొదలైనవన్నీ ఎలా వెలువడతాయి, ఇప్పుడు కూడా ఆకులు వెలువడుతూ ఉంటాయి. అక్కడ నిరాకారీ ప్రపంచము పూర్తిగా ఖాళీ అయిపోతుంది. మళ్ళీ వినాశనం జరగాలి. పెద్ద యుద్ధములో కోట్లాది మంది మరణించి ఉంటారు, లెక్కలేనంతమంది. ఇక్కడ ఎంతమంది

అంతమవుతారు. ఇకపోతే కొద్దిమందే సత్యయుగంలోకి వచ్చి రాజ్యం చేస్తారు. ఇప్పుడు ఎంతమంది మనుష్యులు ఉన్నారు. ఆహారం అంతగా లేదు.

బాబా సంగమయుగములోనే వస్తారని పిల్లలైన మీకు తెలుసు. తండ్రి అర్థం చేయిస్తారు - పిల్లలూ, శరీర నిర్వహణార్థము కర్మలు అయితే చేయవలసిందే. ప్రతి విషయంలో సలహాను అడుగుతూ వెళ్ళండి, ప్రతి ఒక్కరి లెక్కాచారాలు ఎవరివి వారివే. అవినాశీ సర్జన్ నుండి శ్రీమతాన్ని తీసుకుంటూ ఉండండి. అందరికీ తమ-తమ మందును తెలియజేస్తారు. ఈ ప్రపంచం ఇక అంతమవ్వనున్నదని అర్థం చేయించడం జరుగుతుంది. ఇప్పుడు తండ్రిని స్మృతి చేసినట్లయితే నావ తీరానికి చేరుకుంటుంది. తండ్రి నరకాన్ని వినాశనం చేసి స్వర్గ స్థాపనను చేసేందుకే వచ్చారు. మేము మీకు కూడా సలహాను ఇస్తున్నాము - శ్రీ శ్రీ ద్వారా లభించిన శ్రీమతాన్ని మేము మీకు కూడా ఇస్తున్నాము. తండ్రి అంటారు, నన్ను స్మృతి చేసినట్లయితే మీరు స్వర్గాధిపతులుగా అవుతారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన ఆత్మిక పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. సేవ పట్ల అభిరుచిని ఉంచాలి. అనారోగ్యములో కూడా తండ్రి స్మృతిలో ఉండాలి మరియు ఇతరులకు కూడా స్మృతిని ఇప్పించాలి. నోటి ద్వారా జ్ఞాన దానం చేస్తూ ఉండాలి.

2. పక్కా స్వంత పిల్లలుగా అవ్వాలి అనగా ఒక్క తండ్రి స్మృతిలోనే ఉండాలి. ఉదయముదయమే లేచి విచార సాగర మంథనము చేయాలి. ఇంకెవరూ గుర్తుకు రాకూడదు.

వరదానము:- తమ శుభమైన మరియు శక్తిశాలి భావనల ద్వారా విశ్వ పరివర్తనను చేసే విశ్వ కళ్యాణకారీ భవ

పిల్లలైన మీ మనసులలో సదా ఇదే శుభ భావన ఉంటుంది - సర్వుల కళ్యాణము జరగాలి, ప్రతి ఆత్మ అనేక జన్మల కొరకు సుఖీగా అవ్వాలి, ప్రాప్తులతో సంపన్నమవ్వాలి. మీ ఈ శుభమైన మరియు శక్తిశాలి భావన యొక్క ఫలము విశ్వాత్మలను పరివర్తన చేస్తూ ఉంది, ముమ్ముందు ప్రకృతి సహితంగా పరివర్తన జరుగుతుంది ఎందుకంటే సంగమయుగీ శ్రేష్ఠ ఆత్మలైన మీకు డ్రామానుసారంగా ప్రత్యక్ష ఫలము ప్రాప్తించే వరదానము ఉంది, అందుకే ఏ ఆత్మలు మీ సంబంధ-సంపర్కములోకి వచ్చినా కానీ వారు అదే సమయములో శాంతి మరియు స్నేహము యొక్క ఫలాన్ని అనుభూతి చేస్తారు.

స్లోగన్:- త్రికాలదర్శి స్థితిలో స్థితులై నిర్ణయము తీసుకున్నట్లయితే ప్రతి కార్యములో సఫలత ప్రాప్తిస్తుంది.